## అదనపు జలాల కోసం

# ఎమర్జెన్సీ పంపింగ్

### చేతి పంపులపై దృష్టి సారించాలి

- రాబోయే 5 నెలల పాటు తాగునీటిపై మైక్రో లెవల్ ప్లాన్స్
- నీటి కొరత, లో ప్రెషర్ ఫిర్యాదులకు ప్రాధాన్యం
- లీకేజీలు జరిగితే.. 24 గంటల్లో పరిష్కరించాలి
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు
- నల్లాలకు మోటార్లు పెడితే కఠిన చర్యలు
- వేసవి కార్యాచరణపై ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్ష



సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దని, సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రచించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి శుక్రవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే 5 నెలలకు తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో మైక్రో లెవల్ ప్లాన్స్ రూపొందించుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి అదనపు జలాలను తరలించడానికి ఎమర్జెన్సీ పంపింగ్ కోసం ఏర్పాట్లు మొదలు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా సరఫరాలో తక్కువ నీరుంటే.. సర్దుబాటు చేసే లాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో సమయ పాలన పాటించాలని, ఏవైనా ఇబ్బందులుంటే ముందుగానే ప్రజలకు సమాచారమివ్వాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో లైన్ మెన్లు గైర్హాజరైన పక్షంలో.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కలుషిత నీటి సరఫరా, లీకేజీలు జరిగితే సమస్యను గుర్తించి.. 24 గంటల్లో పరిష్కరించాలని తెలిపారు. మోటార్లు, బూస్టర్లు, వాల్వులు రిపేర్లు వస్తే.. ఏఎంస్ కింద మరమ్మతులు చేయాలని వివరించారు. పర్యవేక్షణ, పరిష్కారానికి ప్రత్యేక బృందాలను సీజీఎంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. చేతి పంపులు, బోర్ వెల్స్ నిర్వహణపై దృష్టి సారించాలని.. అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండేందుకు అదనపు సామగ్రి ఉంచుకోవాలని పేర్కొన్నారు.

### డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు

డిమాండ్‌ను అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలని ఎండీ సూచించారు. నగరంలో ఇప్పటికే 72 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. డిమాండ్‌ని బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో లో–ప్రెషర్ సమస్యలు వస్తున్నాయని.. వీటిని నివారించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్–1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గ్యానేందర్ రెడ్డి, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మూసీకి ముప్పు.!

- దర్జాగా కబ్జా చేస్తున్న అక్రమార్కులు
- ఎన్ఓసీ లేకుండానే బఫర్ జోన్‌లో నిర్మాణాలకు పర్మిషన్లు
- పత్తాలేని ఎంఆర్‌డీసీఎల్ ప్రతినిధులు
- గండిపేట నుంచి కొర్రెముల వరకు ఇదే పరిస్థితి
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం
- సీఎం గారూ.. సుందరీకరణ ఇదేనా.?



*హిమాయత్‌సాగర్ జలాశయం కింద నుంచి పారే ఈసీ నది తీరంలోని బఫర్‌జోన్‌లో మట్టిపోసిన రియల్టర్లు*

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ సిద్ధం చేస్తున్నది. ఇప్పటికే దేశ, విదేశాల్లో పర్యటించి పలు నగరాల మధ్య ఉన్న నదుల తీరంలో చేపట్టిన ప్రాజెక్టులను అధికారులతో పాటు సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించి వచ్చారు. మూడేళ్లలో మూసి సుందరీకరణ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. అలాంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన మూసీ నది తీర ప్రాంతంలో కబ్జాలు సైతం అదే స్థాయిలో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాత్రికి రాత్రి మట్టి పోసి తెల్లారే సరికల్లా చదును చేస్తున్నారు. ఇంత జరిగినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాలు కాగా మిగిలిందే మూసి తీరం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. మూసీ తీరంలో 50 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుందని చెబుతున్న అధికారులు, దాన్ని పరిరక్షించడంలో మాత్రం విఫలమవుతున్నారు.

### కుచించుకుపోతున్న బఫర్ జోన్

హైదరాబాద్ మహానగరానికి నైరుతి దిశలో ఉన్న జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌ల కింద నుంచి ప్రారంభమయ్యే మూసి, ఈసీ నదుల తీర ప్రాంతం ఎంతో విశాలంగా ఉంటుంది. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో పట్టణీకరణతో మూసి తీరం చాలా చోట్ల కబ్జాలకు గురికాగా, ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి దాటిన తర్వాత ఉన్న హెచ్ఎండీఏ పరిధిలోని స్థానిక మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని మూసీ తీరం రాత్రికి రాత్రే కబ్జా అవుతూ కుచించుకుపోతున్నది. గండిపేట నుంచి నార్సింగి, మంచిరేవుల మీదుగా బాపుఘాట్ వరకు ఉన్న ప్రాంతం ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండడంతో మూసీ తీరంలోనే భారీ బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. అదేవిధంగా హిమాయత్‌సాగర్ కింద ఉన్న రాజేంద్రనగర్, బుద్వేల్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, బండ్లగూడజాగీర్ ప్రాంతాల్లోని ఈసీ నది తీరంలోనూ మట్టితో పూడుస్తూ బఫర్‌జోన్‌ను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. లంగర్‌హౌస్ బాపుఘాట్ నుంచి రెండు నదుల ఒక్కటిగా మారిన తర్వాత ఉన్న మూసీ తీర ప్రాంతంలోనూ అదే స్థాయిలో మట్టి పోస్తూ చదును చేస్తూనే ఉన్నారు. బఫర్ జోన్‌ను దృష్టిలో పెట్టుకొని అనుమతులు ఇవ్వాల్సిన హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ప్లానింగ్ విభాగాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. మూసి, ఈసీ నదుల తీర ప్రాంతం నుంచి అనుమతుల కోసం వచ్చే దరఖాస్తుల విషయంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖల నుంచి ఎన్ఓసీ పత్రం లేకున్నా భవన నిర్మాణాలకు, లేఅవుట్‌లకు అనుమతులు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మూసీ సుందరీకరణ కోసం ఏర్పాటైన మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) నుంచి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించింది. తార్నాకలో ఉన్న కార్యాలయానికి మూసీ తీర ప్రాంతం దూరంగా ఉండడం, పర్యవేక్షణకు అవసరమైన యంత్రాంగం లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట మూసుకుపోతూనే ఉంది. మూసి పరీవాహక ప్రాంతం గండిపేట నుంచి తూర్పున ఉన్న కొర్రెముల దాకా సుమారు 55కి.మీ మేర అక్రమార్కులు మూసినిపూడ్చి వేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# ఆభరణాలకు ఫిదా..

- సీబీజేలో ప్రత్యేక వెడ్డింగ్ జ్యువెల్లరీ
- మాఘమాసంలో సరికొత్త జ్యువెల్లరీని పరిచయం చేస్తున్న కంపెనీలు
- తక్కువ ధరలో.. సౌకర్యవంతమైన ఆభరణాలపై మహిళల చూపు
- రూపం, వయస్సు, డ్రెస్సు ఆధారంగా జ్యువెల్లరీ
- ట్రెండ్‌కు తగ్గట్టుగా ఆభరణాల కొనుగోలు



జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23 : అలంకరణ నగరంలో 40 సంవత్సరాల అనుభవం గల సంస్థ సీబీజే వెడ్డింగ్ జ్యువెల్లరీ ప్రత్యేకతను చాటుకుంటోంది. అల్ట్రా లైట్ వెయిట్ బంగారు ఆభరణాల తయారీలో ప్రసిద్ధి పొందిన ఈ సంస్థ.. దేశంలోని బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, ముంబైలో వర్క్‌షాప్‌లతో విభిన్నమైన డిజైన్‌లు కలిగిన సంస్థగా పేరొందింది. నాణ్యత, నమ్మకం, అతి తక్కువ తరుగుతో.. బంగారు ఆభరణాలు మార్కెట్ రేటు కంటే తక్కువ ధరతో కస్టమర్ల అభిమానాన్ని చూరగొంది. మాఘమాసంలో సీబీజేలో బంగారు ఆభరణాలది ప్రత్యేక స్థానం. పెండ్లీ ఆభరణాలలో వైవిధ్యమైన డిజైన్లు అందుబాటులో ఉంటాయి. పెండ్లీ కూతురుకు సరిపడా మిరుమిట్లు గొలిపే హారాలు, 100 శాతం హెచ్‌యూఐడీ బంగారు ఆభరణాలు లభ్యమవుతున్నాయి. కేపీహెచ్‌బీ వార్షికోత్సవ ఆఫర్‌గా బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.300 భారీ డిస్కౌంట్‌ను ప్రకటించారు.

### బ్రాంచీలను విస్తృతం చేస్తున్న సీబీజే..

సీజన్‌తో సంబంధం లేకుండా మగువల మనసును దోచే ఆభరణాలు అనేకం. చెవిపోగుల నుంచి వడ్డాలం వరకు ప్రతీది ఓ ప్రత్యేకత. ట్రెండ్‌కు తగ్గ జ్యువెల్లరీని పరిచయం చేయడానికి నగరంలో సీబీజే సరికొత్తగా తమ బ్రాంచీలను విస్తృతం చేస్తున్నది. ముఖ ఆకారాన్ని ఆధారం చేసుకుని.. వయస్సును దృష్టిలో ఉంచుకుని.. వర్కింగ్‌ను బట్టీ.. డ్రెస్సు ఆధారంగా చేసుకుని.. ఇలా విభిన్న రకాలుగా జ్యువెల్లరీని మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే జ్యువెల్లరీ ట్రెండ్‌ను మగువలు ఫాలో అవుతున్నారు.

### ట్రెండ్ ఫాలో..!

ప్రస్తుతం బోల్డ్, క్లాసిక్ రంగుల మిశ్రమంతో రూపొందించిన ఆభరణాలు, మీనాకారి విడివిడిగా రాళ్లతో తయారు చేసిన ఆభరణాల ట్రెండ్ నడుస్తోంది. వీటితో పాటు డైమండ్, రూబీ లాంటి రంగురాళ్లతో ఆభరణాలు తయారుచేసే క్లాసిక్ డైమండ్ జ్యువెల్లరీ కూడా బాగా ట్రెండ్‌లో ఉంది. రోజ్‌గోల్డ్ కూడా బాగా ప్రాచుర్యంలో ఉన్నదని జ్యువెల్లరీ నిర్వాహకులు రాధిక తెలిపారు. ఇండియన్ స్కిన్‌టోన్‌పై బాగా కనిపించేలా రోజ్ గోల్డ్ ఉంటుంది. ఇప్పుడు దీనిని మగువలు కొనడానికి అమిత ఆసక్తి చూపిస్తున్నారు. బోల్డ్‌ఎలిగెంట్ చోకర్, ఈయర్ రింగ్స్ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. ఎప్పుడైనా సరే ధరించడానికి అనువుగా ఉంటున్న వెరైటీలను ఎంపిక చేసుకుంటున్నారు. ఇక అన్ని రంగుల దుస్తులతో మ్యాచ్ అయ్యేలా ట్రాఫ్ట్, ప్రొటెక్టెడ్ జెమ్ స్టోన్ రత్నాలు పొదిగిన జ్యువెల్లరీ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నదని నిర్వాహకులు చెప్పారు. ప్రస్తుతం ఫ్లూయిడ్ ఫార్మ్ దుస్తులు ఎక్కువగా ధరిస్తున్నారు. ఇలాంటి స్థితిలో మరింత అందంగా కనిపించడానికి ఫ్లూయిడ్ ఫార్మ్ ఆభరణాలను ఆశ్రయిస్తున్నారు.



### తక్కువ ధరలో సౌకర్యంగా..!

ఆభరణాలను డిజైన్ చేసే సమయంలో మూడు విషయాలను దృష్టిలో ఉంచుకుంటారు. ఒకటి సౌందర్యపు విలువ, రెండోది ధరించడంలో ఉన్న సౌకర్యం, మూడోది తక్కువ ధర.. ప్రస్తుతం మహిళలు తక్కువ ధరలో అందమైన డిజైన్లను వెతుకుతున్నారు. అవి అన్ని అవసరాలకు తగ్గట్టుగా ఉండాలని భావిస్తున్నారు. బ్రైడల్ జ్యువెల్లరీలో మహిళలు అన్ని రకాల ఆభరణాలు అంటే.. పాపిడి బిళ్ల, ముక్కుపోగు, జూకాలు, నెక్లెస్, మీడియం నెక్లెస్, చెవి జూకాలు, చెవి పోగులు, దండె కడియాలు, చేతి వంకీలు, వడ్డాణం, గజ్జెలు, మెట్టెలు.. వంటి వాటిపై మనసు పారేసుకుంటున్నారు. ఇక ఆఫీసుకు వెళ్లే మహిళల ఇష్టాలు.. సాధారణ మహిళలకు భిన్నంగా ఉంటాయి. వాళ్లు ఎక్కువగా చిన్న చెవి పోగులు, చిన్న జూకాలు, నార్మల్ క్లాసిక్ డ్రెస్‌తో పాటు ధరించడానికి ఇష్టపడుతారని ఐటీ ఉద్యోగి రవళి తెలిపారు. వేసుకునే డ్రెస్సులకు మ్యాచ్ అయ్యే ఆభరణాలను కొనుగోలు చేస్తామని చెప్పారు.

### ఆకారాన్ని బట్టీ జ్యువెల్లరీ

ఆభరణాలు ట్రెండ్ కంటే కూడా ఎక్కువగా ముఖాన్ని బట్టి ధరించాలి. ఓవెల్ ఫేస్‌లో ముఖం ఉన్న మహిళలకు మార్కిజ్ షేప్ చెవి ఆభరణాలు బాగుంటాయి. రౌండ్ షేప్ ఉన్న వాళ్లు జూకాలు ధరిస్తే బాగుంటాయి. స్క్వేర్ షేప్ ముఖం ఉన్న వాళ్లు జామితీయ ఆకారంలో ఉండే చెవి ఆభరణాలు ధరిస్తే బాగుంటుంది. టీనేజీ అమ్మాయిల్లో చిన్న చిన్న కలర్‌ఫుల్ డెలికేట్ ఆభరణాలు ధరించే ట్రెండ్ ఎక్కువగా నడుస్తోంది. ఇప్పుడు నోస్‌పిన్, నోస్ క్లిప్స్ బాగా ప్రచారంలో ఉన్నాయి. అవి వెస్టర్న్ డ్రెస్సుల్లో బాగా నప్పుతాయి.

*- రాధికా మన్నె, జ్యువెల్లరీ నిపుణులు.*

### కలర్‌ఫుల్ జ్యువెల్లరీ వినియోగం ఎక్కువగా ఉంది

జ్యువెల్లరీ వినియోగం లేకుండా ఏ పెండ్లీ లేదు. ఎలాంటి వేడుకలైన మగువలు ఏదో ఒక జ్యువెల్లరీ ధరించాల్సిందే. అందులో ఇప్పుడు బాగా వినియోగంలో కలర్‌ఫుల్ జ్యువెల్లరీ ఉంది. మిడిల్ ఏజ్‌లో ట్రెడిషనల్, ఫైవ్ వర్క్ ఉన్న క్లాసిక్, ఫైన్‌గోల్డ్ ఆభరణాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వీటితో పాటు జూకాలు, చెవి పోగులు, జాలీవర్క్, డైమండ్ లుక్ ఎక్కువగా ట్రెండ్‌లో ఉన్నాయి. 50 ఏండ్లు దాటిన మహిళలకు సింగి లైన్ నెక్లెస్, కుందన్ నెక్లెస్, ప్యూర్ డైమండ్ లేదా గోల్డ్ కంకణం లాంటివి బాగా ప్రచారంలో ఉన్నాయి. సీబీజే షో రూమ్‌లలో విభిన్న రకాల జ్యువెల్లరీ అందుబాటులో ఉంది.

*-మానస, ఫ్యాషన్ విద్యార్థి*

